క్లుప్తంగా

కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300 వేతనం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వేతనం పొందవచ్చని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తవిసికొండ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న ఖండిత కందకాల పనులను పరిశీలించారు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేసుకోవాలని సూచించారు. సమయ పాలన పాటించడమే కాకుండా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయనతో పాటు ఏపీఓ శేషన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మధుశేఖర్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవుకు: అవుకు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అవుకు, ఓబులాపురం, చెన్నంపల్లె, శివవరం, మెట్టుపల్లె తదితర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బనగానపల్లె: స్థానిక రవ్వలకొండపై కాటసాని రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న వీరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యాన్నదాన సంస్థ ఆవరణలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిత్యాన్నదాన కమిటీ సభ్యులు నాగరాజువర్మ, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, వెంకట్రామిరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ ఆంజనేయస్వామి సమీపంలోని మదీనా క్లీనిక్‌లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తెలిపారు. కర్నూలుకు చెందిన శాంతిరామ్ ఐ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26 నుంచి టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

ప్యాపిలి: స్థానిక అన్నపూర్ణ సమేత ఈశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, డాక్టర్ దేవీ దయానంద్ సింగ్ తెలిపారు. శనివారం ఈశ్వర దేవాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వివరాలు వెల్లడించారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై డాక్టర్ తొగట సురేశ్‌బాబు ధార్మిక ప్రవచనాలు ఉంటాయన్నారు. అనంతరం భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర దేవాలయం, అంకాళ పరమేశ్వరి దేవాలయాల నిర్వాహకులు కంచి నరేశ్ కుమార్, గోపాల్ రెడ్డి, భక్తులు లక్ష్మీరంగయ్య, రామాంజనేయులు, లక్ష్మీసులోచన పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: కోవెలకుంట్ల పట్టణంలో ఈ నెల 24న జరగనున్న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని హుసేనాపురం, ఏనుగుమర్రి, పీఆర్ పల్లి ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. యూటీఎఫ్ ఆవిర్భవించిన 50 ఏళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులు సాధించి పెట్టిందన్నారు. ఆదివారం కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే మహాసభలకు యూటీఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. హెచ్ఎంలు అన్వర్‌బాషా, శ్రీధర్, యూటీఎఫ్ నాయకులు సర్వజ్ఞమూర్తి, చంద్రమోహన్, రాజ కుల్లాయప్ప, మోహన్‌రెడ్డి, మధు, శివశంకర్, అంబేడ్కర్, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. నయనాలప్ప

- రేపటి నుంచి రెండు రోజులపాటు తిరుణాల
- కార్తీక కడ సోమవారం తరలిరానున్న భక్తులు
- ముస్తాబవుతున్న ఓంకారేశ్వరుడి ఆలయం
- నయనాలప్ప క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు



కొలువైన ఓంకారేశ్వరుడు



నయనాలప్ప క్షేత్రం



విబూది పండ్లు

సంజామల: నంద్యాల జిల్లాలోని శైవ క్షేత్రాల్లో శ్రీశైలం, మహానంది తర్వాత అంతట ప్రాధాన్యత కలిగిన క్షేత్రం నయనాలప్ప ఆలయం. ఈ క్షేత్రాన్ని సాక్ష్యాత్తు ఆ పరమేశర్వరుడే నిర్మించాడని భక్తుల నమ్మకం. భక్తుల కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు పరమేశ్వరుడు. ఎర్రమల కొండల్లో వెలసిన ఈ ఆలయంలో కార్తీక మాసం కడ సోమవారం పురస్కరించుకుని తిరుణాల వైభవంగా జరుగుతాయి.

ఆలయ చరిత్ర

సుమారు 400 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రానికి చెందిన చెన్నబసప్ప అనే భక్తుడు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రకృతి సౌందర్యాలకు ఆకర్శితుడై ఇక్కడే స్థిరపడ్డాడు. ఒక రోజు చెన్న బసప్ప నిద్రిస్తుండగా కలలో శివుడు ప్రత్యక్షమై ఇక్కడ శివుని ఆలయం నిర్మించమని చెప్పాడని భార్య శివాంబతో చెర్చించినట్లు పురాణాల కథనం. ఆలయం ఖర్చుతో కూడుకున్నదని భార్య శివాంబ చెప్పగా శివాలయ నిర్మాణంపై ఆందోళన అవసరంలేదని.. పక్కనే ఉన్న అక్కంపల్లె గ్రామస్తులను ఆశ్రయించాలని శివుడు కలలో తెలియజేశాడని భర్యతో చెన్నబసప్ప చెప్పాడు. అక్కంపల్లె గ్రామానికి చెరుకుని గ్రామస్తులకు విషయాన్ని వివరించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెన్నబసప్ప తన ఎద్దుల సహాయంతో దిగువ నుంచి కొండ మీదకు రాళ్లను సాగించి గర్భగుడి పనులను పూర్తి చేశాడని చరిత్ర. ఒక రోజు రాత్రి నిద్రిస్తున్న సమయంలో శబ్దం వినపడగా శివాంబ లేచి చూసే సరికి ఆ పరమేశ్వరుడు తన శివగణంబులతో ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యాలను చూసి నిశ్చేష్టురాలైంది. భర్త బసప్పను లేపగా శివుడు అదృశ్యమయ్యాడు. బసప్ప శివుడి కోసం కొండ కింద కఠోర తపస్సు చేపట్టాడు. శివుడు అదృశ్యవాణితో బసప్పను దీక్ష విరమించుకోమని, త్వరగా ఆలయ నిర్మాణం పూర్తి చేసి ఓంకారేశ్వరుడిగా ప్రతిష్ఠింప చేసి కాశీ క్షేత్రానికి వెళ్లి అక్కడి నుంచి జలాన్ని తెచ్చి అభిషేకించాలని అప్పుడు దర్శన భాగ్యం కలుగునని పలికెను. శివాజ్ఞ మేరకు బసప్ప కాశీ బయలుదేరుతాడు. భర్త బసప్ప వెళ్లే సమయానికి శివాంబ రెండు నెలల గర్భిణి. పరమేశ్వరుడు మీద భక్తితో ఆవుపాలు, నెయ్యితో వీబుది ముద్దలు గదిలో భద్రపరిచేది. శివాంబకు అచ్చం తన పోలికలతో కూమార్తె జన్మనించంతో శరణమ్మగా నామకరణం చేస్తుంది.

చెన్న బసప్ప జీవ సమాధి

ఒక రోజు శివాంబ అక్కంపల్లె గ్రామానికి బిక్షాటనకు వెళ్లగా ఆ సమయంలో కాశీ నుంచి బసప్ప గ్రామానికి చెరుకున్నాడు. అచ్చం తల్లి పోలికలు ఉన్న శరణమ్మను భార్యగా భావించి బసప్ప అనుచితంగా ప్రవర్తిస్తాడు. అసలు విషయం తెలనుకుని బాధపడుతాడు. ఓం కారేశ్వరుడి సన్నిధి చేరుకుని నయనములు ఉన్నందునే ఈ తప్పిదం జరిగిందని భావిస్తాడు. బసప్ప నయనముల తీసి ఓం కారేశ్వరుడి చెంత ఉంచుతాడు. చివరకు జీవ సమాధి అవుతాడు బసప్ప. దీంతో నయనాలప్ప క్షేత్రంగా పేరుగాచింది. కొంత కాలానికి ఎద్దులు కూడా మృతి చెందాయి. వాటిని కూడా బసప్ప సమాధి పక్కనే సమాధి చేశారు.

రెండు రోజుల పాటు ఉత్సవాలు

ఏటా కార్తీక మాసంలో ఓంకారేశ్వరస్వామి క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్తీక కడ సోమవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 24, 25వ తేదీల్లో అంకురార్పన, ఓంకారేశ్వరుని కల్యాణోత్సవం, కుళశ స్థాపన, రుద్రాభిషేకం, గ్రామోత్సవం అంగరంగ వైభంగా జరుగుతుంది. తిరుణాల సందర్భంగా కోలాటం, హరిభజన, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ చంద్రుడు, అర్చకుడు గణేష్ శాస్త్రి తెలిపారు. వృషభాల పోటీలు ఉంటాయన్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

కార్తీక కడ సోమవారాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, కడప జిల్లా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోల నుంచి క్షేత్రానికి ప్రత్యేక సర్వీసులు నడుపనున్నారు. ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు మీదుగా కోవెలకుంట్ల డిపోకు సర్వీస్ వేయనున్నారు. నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల డిపో బస్సులు అక్కపంల్లె, నయనాలప్ప క్షేత్రం మీదుగా జమ్మలమడుగుకు నడవనున్నాయి. నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా, ఆళ్లగడ్డ నుంచి పెద్దముడియం మీదుగా, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు మీదుగా రెండు రోజుల పాటు బస్సులు సర్వీస్‌లు నడపనున్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రామలింగయ్య



రామలింగయ్యను అభినందిస్తున్న బార్ కౌన్సిల్ అధ్యక్షుడు

డోన్ టౌన్: డోన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది రామలింగయ్య ఎంపికయ్యారు. ఆయనకు శుక్రవారం డోన్ కోర్టు ఆవరణలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, న్యాయవాదులు కురిమెట్ల నారాయణ, లక్ష్మన్న, ఖాసీంసాహెబ్, శివరామకృష్ణ, రాఘవేంద్రగౌడ్, రవికుమార్ అభినందనలు తెలిపారు.

చెత్త కుప్పల తొలగింపు



చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

డోన్ రూరల్: మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు తొలగించారు. ''పారిశుద్ధ్యం అస్తవ్యస్తం'' అనే శీర్షికతో గురువారం సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో గ్రామాల్లో చెత్తను శుభ్రం చేయించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ కనుల పండువగా సాగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం



పల్లకీపై విహరిస్తున్న స్వామివారు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహ పాల్గొన్నారు.



బుగ్గానిపల్లెలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక దీపోత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి, అర్చకుడు నాగశేషఫణి శర్మ, గ్రామస్తులు బ్రహ్మసూత్ర మరకత నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ నామస్మరణలతో కార్తీక దీపాలు వెలిగించి, గంగా హారతి నిర్వహించారు.

సస్యరక్షణతో పురుగుల నివారణ



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ జ్యోతి

కొలిమిగుండ్ల: కంది పంటను ఆశిస్తున్న వివిధ రకాల పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారిణి జ్యోతి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటను ఏఈఓ నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 1800 ఎకరాల్లో కంది పంట సాగులో ఉందన్నారు. ప్రస్తుతం పంట మొగ్గ దశలో ఉండడంతో మరూక మచ్చల పురుగు, శనగ పచ్చ పురుగులు పడుతున్నాయని తెలిపారు. వాటి నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా నోవాలురాన్ 0.5 మి.లీ లీటర్ లీటర్ నీటిలో కలిపి మొగ్గ బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. పైరులో మచ్చల పురుగు, కాయ ఈగ ఉధృతి ఉంటే ఫ్లుబెండమైడ్ 0.2 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

వాల్మీకి గుహల వద్ద విద్యార్థుల సందడి



వాల్మీకి గుహల వద్ద బూరుగల పాఠశాల విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లిలో ఉన్న వాల్మీకి గుహలకు విద్యార్థులు తరలివస్తున్నారు. కార్తీక మాసం కావడంతో పర్యాటకులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు కూడా తరలివస్తుండడంతో సందడి వాతావరణ నెలకొంది. శుక్రవారం బూరుగల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గుహల అందాలను వీక్షించారు. సహజసిద్ధంగా ఏర్పడిన గుహల అందాలను చూడడానికి రెండు కళ్లు చాలవని సంతోషం వ్యక్తం చేశారు.

కంటి సమస్యలపై జాగ్రత్తలు అవసరం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కోవెలకుంట్ల: విద్యార్థులు కంటి సంబంధ సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణుడు కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలలు, పట్టణ శివారులోని గురుకుల పాఠశాలతో కలిపి 1,364 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 117 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి త్వరలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తారని కంటి డాక్టర్ తెలిపారు. విటమిన్ ఏ లోపం, పోషకాహార విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా తీసుకోకపోవడం వల్ల దృష్టిలోప సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రాజయ్య, అరుణకుమారి, సీహెచ్ఓ లక్ష్మి, ఎంపీహెచ్ఎస్‌లు మునిస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికులపై అవలంభిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఈ నెల 26న తలపెట్టిన దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి శివబాలకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నంద్యాలలో జరిగే నిరసన ర్యాలీకి రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు బాల సంజీవులు, అబ్రహం, రామాంజనేయులు, నాగేంద్ర, బాషా పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీచైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న 104 సిబ్బంది

కొలిమిగుండ్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డ్రైవర్ భాస్కర్, డీఈఓ ప్రతాప్ కోరారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. 104 సర్వీసులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు.

వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలి



డోన్: రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా

డోన్ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా అన్నారు. పట్టణ సమీపంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, మందులు, వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని తెలిపారు. రోగులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్, వైద్యులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బేతంచెర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ వెంకటరమణ, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు బేతంచెర్ల పట్టణంలోని 1,3 అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు ప్రియాంక, తస్లీమ, గాయత్రి ఉన్నారు.

30న మాదిగల కార్తీక వన భోజనం

డోన్ టౌన్: అరుంధతి జాంభవ మాదిగ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న డోన్‌లోని ఉడుములపాడు దత్తాత్రేయస్వామి దేవాలయంలో కార్తీక వన భోజనం నిర్వహిస్తున్నట్లు మాదిగ సంఘాల ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. మాదిగ కుటుంబాలు తరలిరావాలని కోరారు.

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి

కొలిమిగుండ్ల: 108 వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కొలిమిగుండ్ల 108 ఉద్యోగులు రవి, భాస్కర్, చంద్రనాయక్, చిన్నయ్య, రాముడు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ శివరాముడు, ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డికి కరపత్రాలను అందజేశారు. 18 ఏళ్ల నుంచి 108 వ్యవస్థలో పని చేస్తున్నామని.. ప్రభుత్వం మారిన ప్రతిసారి తమ జీవితాలు బాగుపడుతాయని ఎదురుచూస్తున్నా తమ తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 108 వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు కాకుండా నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వలంటీర్లకు నెలకు రూ.10వేల జీతం ఇస్తామని ఇచ్చిన హామీని నిలబుట్టకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వలంటీర్ల వ్యవస్థ లేదని సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

డోన్ టౌన్: కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు టాలీ ప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ తదితర వాటిపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. బీ.కాం, ఎం.కాం చదివి 20 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. విజయవాడలో 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9000487423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: డ్వాక్రా మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీఓఏలు, డ్వాక్రా మహిళలతో సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణాలు పొందవచ్చని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ తదితర పథకాలపై ఏపీఎం శ్రీనివాసులు అవగాహన కల్పించారు. స్త్రీనిధి మేనేజర్లు అరుణ్‌కుమార్‌రెడ్డి, చంద్రిక, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతిపై నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని తమ్మడపల్లి సర్పంచ్ యన్నం వెంకట్రామిరెడ్డి మృతిపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంతాపం తెలిపారు. శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ అభివృద్ధిలో వెంకట్రామిరెడ్డి సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట శంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

పశుగణన సర్వే పరిశీలన



కైప గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న మారుతి సకారామ్

బనగానపల్లె రూరల్: మండలంలోని అప్పలాపురం, కైప, బత్తులూరుపాడు గ్రామాల్లో జరుగుతున్న పశుగణన సర్వేను బనగానపల్లె పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారామ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం పశుగణన సర్వే చేశామని, మళ్లీ ఇప్పుడు కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా పశుగణన సర్వే చేస్తున్నట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్ని పశువులు, మేకలు, జీవాలు, కోళ్లు, కుక్కలు, పందులు తదితర 16 రకాల జీవాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు సర్వే సిబ్బందికి సహకారించాలని కోరారు.